# మానవత్వం

యం.సి. శివశంకర శాస్త్రి

అనంతపురం బస్టాండులో రాయదుర్గం వెళ్ళాల్సిన ఎర్రబస్సు కదిలేందుకు సిద్ధంగా ఉంది. అది వర్షాకాలం అయినందున వీలైనంత తొందరగా ఇళ్ళకు చేరుకోవటం మంచిదన్న తలంపుతో రాయదుర్గం మార్గాన వెళ్ళాల్సినపల్లె జనమంతా బస్సునిండా ఎక్కేశారు.

కిక్కిరిసిన జనంతో కిటకిటలాడిపోతోన్న ఆ బస్సు, కండెక్టర్ వచ్చి రైట్ చెప్పగానే నిండు గర్భిణిలా భారంగా ముందుకు కదిలింది.

బస్టాండుదాటి కొంత ముందుకెళ్ళగానే "అయ్యా! కండెక్టర్! ఎవరో ముసలామె బస్సుకోసమే ననుకుంటాను పరుగెత్తుకుంటూ వస్తోంది - ఓసారి బస్సాపమని చెప్పవయ్యా!" ఓ యాభైఏళ్ళతను కండెక్టర్‌తో అన్నాడు.

"అడ్డొచ్చినోళ్ళకంతా బస్సాపుతూ పోతే ఇగమీరంతా



మీమీ ఊళ్ళు చేరుకున్నట్టే" గొణిగేసి టిక్కెట్టివ్వటంలో నిమగ్నమైపోయాడు కండెక్టర్.

గునకపరుగుతో చెయ్యూపుతూ వస్తూనే ఉందా ముసలామె.

"హోల్డాన్ చెప్పవయ్యా!" కండెక్టర్ చేస్తున్నది సహించక కస్సుమన్నాడో నడివయస్కుడు.

"మధ్యలో మీ గొడవేంటయ్యా!" కసురుతూ విసుగ్గా విజిల్ ఊదాడు. బస్సాగింది.

కాసేపట్లో రొప్పుతూ వచ్చి నెత్తిమీదున్నగోనెసంచి మూటను బస్సులో పడేసి, బస్సు దొరికింది లెమ్మన్న సంబరంతో బస్సెక్కబోయిందామె.

"ఏయ్ ముసల్దానా! ఏంటిదంతా? నిలబడేందుకే జాగాలేక ఛస్తూంటే సంసారమంతా మూటకట్టుకొచ్చి పడేసినావ్. ఇంకోబస్సులో రా పో!" కసురుతూ అన్నాడు కండెక్టర్.

"నీకు పుణ్యముంటాది కొప్పడకు నాయనా! ముసలి ముండను, పైగా కళ్ళు కూడా సరిగా కనబడవు తండ్రీ. ఇంకో బస్సుకోసమని కాచుకుంటే ఇల్లు చేరుకునేయాలకి ఆలీసెమయిపోతాది దేవుడా."

"అయితే నీమీద దయదల్చి ఆ మూటా, ముల్లె అన్నీ నా నెత్తిన పెట్టుకోమంటావు. అంతేనా?" కోపంగా అన్నాడు.

"అంత మాటెందుకంటాను నాయనా! మూట ఓ మూలనపడేసి దానిమీదే ఒదిగి నిలబడ్తాను." బతిమలాడింది.

"ఇదిగో నువ్వు మనిషివా? పశువ్వా? అప్పట్నుంచి చెప్పి ఛస్తావున్నా కూడా నీపాటే నీదయింది. ఊరికే వాగకుండా మర్యాదగా దిగిపోతావా లేదా??" ఫుట్ బోర్డుమీదున్న ఆ మూటను కిందికితోసెయ్యబోయాడు.

మునలమ్మ కాళ్ళు పట్టుకునే పరిస్థితి కొచ్చింది.

అయినా అతడు వినటంలేదు. నంచిని తోసెయ్యబోయాడు.

"ఏయ్ కండెక్టర్! ముందా మూటమీద చెయ్యి తియ్. అప్పట్నుంచీ చూస్తా ఉండాను - ఏందయ్యానీ రువాబు? ఆడమనిషిమీద ఆ మాత్రం జాలి సూపనోడివి నువ్వూ ఒక మనిసివేనా? ఊఁ... చెయ్యి తియ్" ఎదిరించి పల్కిందా బస్సులోని ఓ పురుష కంఠం.

"ఎవర్నాయనా! ఆ స్త్రీజనోద్ధారకుడు?" వెక్కిరించినట్టుగా దీర్ఘాలుతీస్తూ పల్కి అతనివైపు ఎగాదిగా చూశాడు కండెక్టరు.

ఎగతాళి చేసినట్టుగా అతడన్న మాటలకి బస్సులోని చాలా కంఠాలు ఫక్కుమన్నాయి.

శాగబారిన తుమ్మ మొద్దువంటి శరీరం, గుంత కళ్ళూ, పురిపెట్టిన మీసాలకు తోడు నెత్తిమీద రుమాలు చుట్టుకున్న ఆ మనిషి నిజంగా ఓ అడవి మనిషిలా ఉన్నాడు.

"నువ్వెక్కించుకోమన్నోళ్ళందర్నీ ఎక్కించుకోడానికి ఈ బస్సు మీ అబ్బదనుకున్నావా?" ముక్కుపుటాలెగరేస్తూ అతనికి దగ్గరగా వెళ్ళి అన్నాడు కండెక్టర్.

"లేకపోతే బస్సు మీ అయ్యదా? ఇట్లే నీ తల్లినో, చెల్లినో ఇంకో కండెక్టరు ఈసడించుకుంటే నీకెట్లుంటాదో ఓసారి ఆలోచించుకో."

"ఆపయ్యా! నీ పురాణం" కుక్కని కసిరినట్టు కసిరి "ఏయ్ ముసిల్దానా! ముందామూట దించేసుకుని దిగిపోతావా? లేకుంటే నిన్నూ, నీ మూటనూ విసిరి...!"

"ఏదీ - దమ్ములుంటే పడేయ్ సూద్దాం" కండెక్టరు మాటలు పూర్తికాకనే సీట్లోంచి లేస్తూ అన్నాడా మనిషి.

వాళ్ళ మధ్య తగువు ముదిరి పాకాన పడకుండా ఒకరిద్దరు కండక్టరుకే సర్దిచెప్పి బస్సుముందుకెళ్ళేలా చేశారు.

దాదాపు గంటప్రయాణం ముందుకు సాగాక తను దిగిపోవాల్సిన స్థలంలో మెల్లిగా దిగిపోయిందా ముసలామె.

మరింత దూరం పోయాక బస్సు పెంచలపాడుకి పరువు దూరంలో ఉండే చింతతోపు దగ్గరికొచ్చేసరికి అక్కడో పోలీసువ్యాను ఆగిఉంది.

బస్సాపమని సైగ చేశారు పోలీసులు.

బస్సాగింది.

గబగబా ఓ అరడజను మంది పోలీసులు బస్సెక్కి ప్రతి ప్రయాణీకుణ్ణీ పరీక్షగా గమనిస్తూ అంతవరకూ కండెక్టర్‌తో వాదులాడినతన్ని చుట్టుముట్టారు.

"ఏమిటి? ఏమిటి మీ దౌర్జన్యం?? నేనెవరో తెలుసా?? నన్నొదిలిపెట్టండి" పోలీసులతో పెనుగులాడుతూ అన్నాడతను.

"అయ్యా! నువ్వింకేం మాట్లాడకు. మాకంతా తెలుసు. నువ్వీ బస్సులో వస్తున్నావని మాకు ముందుగావే కబురందింది. మా డ్యూటీ మేము చేస్తున్నాం." సౌమ్యంగా సమాధానం చెప్పారు పోలీసులు.

మారు మాటాడకుండా బస్సుదిగి వాళ్ళవెంట నడచి వ్యాన్‌లో కూచున్నాడతను.

"ఫలానా నాయకుడి అనుచరుడతడు. ఇతనిమీద చాలాకేసులున్నాయ్" ఓ పాసింజరు తన పక్కనే కూచున్న మరో పాసింజర్‌తో చెబుతోన్న మాటలు బస్సులో కూచున్న అందరికీ వినిపించాయి.

"ఏ నక్సలైటో లేక ఏ ఖూనీకోరో అయ్యుంటాడు. అడ్డొచ్చినోళ్ళనంతా ఎక్కించుకోమని రువాబు చేయటానికి బస్సు వీడబ్బ సొమ్మనుకున్నాడేమో. ఎవరో ఇన్ఫర్మేషనిచ్చి మంచి పనిచేశారు. ఇంకొంచెం సేపు అట్టే వాగుంటే నా తడాఖా చూపించుండేవాణ్ణి బోడిగానికి" పోలీసువ్యాన్‌లో కూచున్నతన్ని కొరకొరా చూస్తూ అన్నాడు కండెక్టర్.

"ఏం తప్పుచేశాడని అతన్ని ఆడిపోసుకుంటున్నావయ్యా! అతనెవరైతేనేం మానవత్వం ఉన్న మనిషి. ఇలాంటివాళ్ళింక ఉండబట్టే సంఘంలో ఆడదిమాత్రమైనా మనగల్గుతోంది." ముందువైపు సీట్లోకూచున్న ఓ మగువకంఠం త్రావ్యంగా పల్కిందతన్ని సపోర్ట్ చేస్తూ.


యం.సి. శివశంకర శాస్త్రి
డిప్యూటీ ఇంజనీర్
డబ్ల్యు - 205, హెచ్. ఎమ్. టి. (పోస్ట్)
హైదరాబాద్ - 500 854.





సరోజ, 12-10-411/5, అశ్వీపురం, సికింద్రాబాద్ - 61